# మినీకధ

ఏయ్ ! వినిపించడంలేదా ?

చెముడా ?

వేగం త్రొక్కు- ట్రెయిన్ వచ్చే వేళయిపోతోంది.

ఇందాకటినుంచీ చూస్తున్నాను మెల్లగా చీమ నడకలా !

ఏం ? నిన్నే– తిండి తినలేదా ఏమిటి?

నీరసంగా ఉందా ! కిరాయి తీసుకుంటున్నావుగా !

ఇరవై పైసాలా ? ఏభై పైసాలా !

రేట్లుమాత్రం పెంచేశారు. టాక్సీలు, ఆటోలు అంటే పెట్రోలు ధర హెచ్చు చేశారన్న నెపం.

మీ రిక్షావాళ్ళకి యేం తెగులు పట్టుకుంది ?

ఏ రిక్షావాడిని అడిగినా అదే రేటు.

మీకుగాని యూనియన్ వుందా ఏమిటి?

నేరకపోయి, బుద్ధి గడ్డితిని నీ రిక్షా ఎక్కేను.

నీకా పిక్కసత్తువ లేదు.

నాకా గుండెల్లో రైలు పరుగెడుతోంది

ట్రైనుకి స్టేషన్‌కి చేర్చలేవా చూసుకో నా తడాకా!

నీకు కిరాయి యివ్వను సరికదా రిక్షా ఓనర్‌తో చెప్పి నిన్ను పనిలోంచి తీయించేస్తాను.

నేనెవరో నీకు యింకా తెలిసినట్టులేదు.

నేను యింతలా గొంతు చించుకు అరుస్తున్నా నువ్వు నోరు తెరవ్వు- రిక్షా వేగం తొక్కవు.

ఇవాళ లేవగానే ఎవరి ముఖం చూశానో- అనుకున్న పని ఒకటీ జరిగేటట్టులేదు.

నీ ఏడుపు ముఖం, యీడుపు కాళ్ళు చూస్తూనే అనుకున్నాను ట్రెయిన్ తప్పిపోతుందని.

నా ఖర్మంకాలి యివాళ టాక్సీ, ఆటోలవాళ్ళు సమ్మె చేయాలా!

మీ రిక్షావాళ్ళదే యివాళ రాజ్యం.

మీ రెంతంటే అంత- నాలుగు ఫర్లాంగుల దూరంలేని స్టేషన్‌కి ఎనిమిది రూపాయలా.

ఇంతకీ నువ్వు ఎప్పుడైనా రూపాయి ముఖం చూశావా అంట ?

అదిగో ! విను రైలుకూత.

వినపడుతోందా. లేదా?

నా ప్రయాణం గోవిందా ?

ఇంకా పది నిమిషాలు యీడిస్తేగాని స్టేషన్ చేరదు నీ రిక్షా.

భగవంతుడా! నువ్వే నన్ను కాపాడాలి.

ఈ ట్రెయిన్‌కి వెళ్ళకపోతే నా గతేం కాను?

ఎన్ని ఉద్యోగాలకి అప్లికేషన్లు వేస్తే ఈ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి రమ్మని పిలిచారు. ఉద్యోగం వచ్చినంత మురిసిపోయాను.



## వక్రించని విధి

ఉద్యోగం వచ్చేసినట్లే ఏడుకొండలవాడి హుండీలో వెయ్యమని నూరు రూపాయలు మనియార్డర్ కట్టాను.

వెంకటరమణమూర్తీ ! తండ్రీ! నువ్వే నన్ను కాపాడాలి.

ఇదుగో ! నిన్నే !

అక్కడ ఏమిటా గుంపు ? యాక్సిడెంటా? రిక్షా పోనీ! ఇవన్నీ పట్టించుకుంటూ కూర్చుంటే నా ప్రయాణం గతేం కాను. నా ఉద్యోగం సంగతేమిటి ?

గబగబ పోనీ.

హమ్మయ్య! ఎలాగైతేనేం స్టేషన్‌లో పడేశావు.

సర్కార్ బండి వచ్చిందో, లేదో వెళ్ళి అడుగు.

రావడం, వెళ్ళడం అయే వుంటుంది. అయినా ఏడుకొండలవాడి దయుంటే లేటు కాకూడదా! అయినా ట్రైయిన్స్ సవ్యంగా టైముకి ఎప్పుడు వచ్చేయి గనక. నేనే వెళ్ళి వస్తాను. సామాను యిక్కడే వుండనియ్యి సామాను దించవలసివస్తే నీ ఎనిమిది రూపాయల కిరాయి యిస్తా. లేదా పైసా కూడా యివ్వను తెలిసిందా?

నీ పాపిష్టి ముఖం చూడు– నువ్వు, నీ దిక్కుమాలిన రిక్షాను.

బుద్ధి గడ్డితిని, నేరకపోయి నీ రిక్షా ఎక్కాను.

నా జీవితం నాశనమైంది.

పద – యింటికి, ఇప్పుడు నీ యిష్టం వచ్చినంత తాపీగా త్రొక్కు. కాగల కార్యం అయింది కదా !

నా ఖర్మ కాలింది. నిన్నని ఏం లాభం, నీ కిరాయి తీసుకో.

ఏం సరిపోదా?

ఇంకో రూపాయి తీసుకో.

ఏమిటి కిరాయి తీసుకోవా ?

నిజమేననుకో – నీ నుంచే నా వ్యవహారం చెడింది – అంతమాత్రానా !

చేతకానివాడికి శౌర్యం జాస్తీ అంటారు – యిదేనా ?

మరునాడు ఉదయం శేషగిరి న్యూస్ పేపర్ ఫ్రంట్ పేజీ బేనర్ చూసి నిర్ఘాంతపోయాడు– సర్కార్ ఎక్స్‌ప్రెస్ రాజమండ్రి స్టేషన్‌కి అయిదు కిలోమీటర్ల దూరంలో పట్టాలు తప్పింది. రెండువందల మంది ప్రయాణీకులు మరణించారు!

శేషగిరి గుండె జల్లుమంది. వెంటనే షర్ట్ వేసుకుని చెప్పుల్లో కాళ్ళు దూర్చి వీధిలోకి ఒకటే పరుగు– ముసలి రిక్షావాడిని అన్వేషించడానికి. రిక్షావాడి పేరు ఏడుకొండలు.

**ఓ. ఆర్. కె. రావ్**

